సాక్షి
నంద్యాల
మంగళవారం । 30 । జనవరి । 2024



మల్లన్నకు వెండి రథోత్సవం

శ్రీశైలం: భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ నిర్వహించి, అనంతరం వెండిరథంపై ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేయించారు.



అలరించిన సంప్రదాయ నృత్యం

శ్రీశైలం: నిత్య కళారాధనలో భాగంగా సోమవారం హైదరాబాద్ రమ్యశ్రీ రాఘరమ్య కల్చరర్ ఆర్గనైజేషన్ వారు ప్రదర్శించిన సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



.. జొన్నకు 'మద్దతు'

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్కెటింగ్ శాఖ అధికారులు రైతుల వద్దకే వెళ్లి కందులను మార్కెట్ ధరతో, జొన్నలను మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నారు.

8లో▸

న్యూస్‌రీల్

అహోబిలేశుడికి నీరాజనం



పూజలందుకుంటున్న ఉత్సవమూర్తులు

రుద్రవరం: ముత్తలూరులో పార్వేట ఉత్సవమూర్తులకు ఘన స్వాగతం లభించింది. పార్వేట ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారి పల్లకీ గ్రామ శివారులోకి చేరుకోవడంతో గ్రామ సర్పంచు మహేశ్వరి, పంచాయతీ కార్యదర్శి పాములేటి, వీఆర్వో వృశేన్, గ్రామ పెద్దలు ఎదురేగివెళ్లి పూజలు చేసి గ్రామంలోకి స్వాగతించారు. పల్లకీ రాకతో గ్రామంలో సందడి నెలకొంది. స్వామి వారి పల్లకీ ఓ తెలుపు మీద నుంచి మరో తెలుపు మీదకు చేరుకునే సరికి ఆయా తెలుపుల యజమానులు అంతా సిద్ధం చేస్తున్నారు. పల్లకీ అక్కడికి రాగానే ఆయా తెలుపుల యజమానులు మొదటి పూజలో కాయా కర్పూరం వంటివన్ని అర్చకుడు కళ్యాణరంగన్‌కు అందించగా ఆయన వాటిని స్వామివారికి సమర్పించి శటారుతో ఆశీర్వదించారు. అడుగడుగునా ఉత్సవ మూర్తులకు పూజలు చేశారు.

5 నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్మీడియెట్ పబ్లిక్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నట్లు ఉమ్మడి జిల్లాల ఆర్ఐఓ గురువయ్యశెట్టి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 5వ తేదీ నుంచి వొకేషనల్ విద్యార్థులకు, ఫిబ్రవరి 11వ తేదీ నుంచి జనరల్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించబడుతాయన్నారు. ఈ పరీక్షలు 20వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారుల సమన్వయంతో పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

కర్నూలు డీఐజీగా విజయరావు

కర్నూలు: కర్నూలు రేంజ్ డీఐజీగా కాకినాడ మూడో బెటాలియన్ కమాండెంట్ విజయరావును నియమిస్తూ ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడున్న సెంథిల్‌కుమార్‌ను ఆక్టోపస్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అలాగే కర్నూలు సెబ్ అడిషనల్ ఎస్పీగా ఉన్న కృష్ణకాంత్‌పటేల్‌ను కాకినాడ మూడో బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ చేశారు. అయితే, కర్నూలు ఏఎస్పీగా ఎవరినీ నియమించలేదు.

ఎండు మిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని టెక్కె మిర్చి యార్డులో గత వారంతో పోలిస్తే ఎండుమిర్చి ధరలు కాస్త ఆశాజనకంగా ఉన్నాయి. సోమవారం రైతులు మార్కెట్‌కు సూపర్–10, తేజ్, సూపర్–5 రకాలు అమ్మకానికి తెచ్చారు. సూపర్–10 రకం జనరల్ గరిష్ఠ ధర క్వింటాలు రూ.19,000, మధ్యస్థ ధర రూ.17,500, కనిష్ఠ ధర రూ.14,500 పలికింది. తేజ రకం జనరల్ గరిష్ఠ ధర క్వింటాలు రూ.17,800, మధ్యస్థ ధర రూ.17,000, కనిష్ఠ ధర రూ.16,200 పలికింది.

ప్ర'జల' కల సాకారం

- డోన్ నియోజకవర్గ ప్రజల తాగునీటి కష్టాలు పరిష్కారం
- వాటర్ గ్రిడ్ పథకాన్ని ప్రారంభించిన మంత్రి బుగ్గన, ఎంపీ పోచా
- సభలో ఉద్వేగంతో ప్రసంగించిన మంత్రి



ఏరియేటర్ వద్ద పూజలు చేస్తున్న మంత్రి బుగ్గన, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తదితరులు

బేతంచెర్ల: ఓ వైపు హంద్రీనీవా నీటిని చెరువులకు మళ్లించి రైతుల సాగునీటి కష్టాలు తీర్చిన రాష్ట్ర ప్రభుత్వం మరో వైపు కృష్ణా జలాలను డోన్ నియోజకవర్గానికి చేర్చి ప్రజల మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించింది. దశాబ్దాలుగా తాగు నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ప్రాంతానికి శుద్ధజలాన్ని దరి చేర్చి దాహార్తిని తీర్చింది. డోన్ నియోజకవర్గ ప్రజల కల సాకారం కావడంతో అంతటా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం మండల పరిధిలోని బుగ్గానిపల్లె తండా సమీపంలో 8 ఎకరాల్లో నిర్మించిన ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద రూ. 351 కోట్లతో చేపట్టిన వాటర్ గ్రిడ్ పథకాన్ని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభించారు. పథకంలో భాగమైన 42 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన ఉద్వేగంగా ప్రసంగించారు. గతంలో ప్రజల తాగునీటి కష్టాలు కళ్లారా చూసిన తాను ఇప్పుడు వాటర్‌గ్రిడ్ పథకాన్ని ప్రారంభిస్తుండటం వరంగా భావిస్తున్నానన్నారు. 32 కిలోమీటర్ల దూరంలో ఉన్న గోరుకల్లు రిజర్వాయర్ నుంచి నీటిని తెచ్చి డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాలలోని 138 గ్రామాల్లో ఇంటింటికి శుద్ధమైన నీటిని అందిస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో తాగు, సాగు నీటిని అందించడంతో పాటు, రహదారులు, ఆలయాలు అభివృద్ధి చేశామన్నారు. విద్య, వైద్య రంగాల్లో డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దామన్నారు. నియోజకవర్గంలో రూ. 2,500 కోట్లతో ఐదేళ్లలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల సమస్యలు పరిష్కరించామన్నారు. డోన్ అభివృద్ధిలో భాగస్వామ్యం అయిన కలెక్టర్లు, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులకు మంత్రి బుగ్గన కృతజ్ఞతలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేద ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేసి దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా 30 లక్షల ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి చరిత్ర సృష్టించారన్నారు. ఎంతో అభివృద్ధి చేసినా టీడీపీ నాయకులకు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. 2014 ఎన్నికల్లో 12 గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఒక్కటి కూడా ఇవ్వని చంద్రబాబు ఇప్పుడు 2024 ఎన్నికల కోసం 3 గ్యాస్ సిలిండర్లు ఉచితమంటే ఎవరూ నమ్మరన్నారు. డోన్ టీడీపీ అభ్యర్థినంటూ చెప్పుకుని తిరుగుతున్న వ్యక్తి చంద్రబాబు కంటే మోసకారి అని విమర్శించారు.



కార్యక్రమానికి హాజరైన మహిళలు

బుగ్గన అపరభగీరథుడు..

డోన్ నియోజకవర్గానికి తాగునీరు, సాగునీటిని అందించిన మంత్రి బుగ్గన అపర భగీరథుడని ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి కొనియాడారు. రూ. 2,500 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారంటే ఎవరూ ఊహించి ఉండరన్నారు. డోన్ ప్రజలకు మౌలికసదుపాయాలు కల్పించి ఆదర్శంగా నిలిచారన్నారు. మంత్రి బుగ్గనపై ఎన్నికల్లో పోటీకి దిగాలంటే ప్రతి పక్షాలు భయపడేలా డోన్‌ను అభివృద్ధి చేశారన్నారు.



బుగ్గానిపల్లె తండా వద్ద వాటర్ గ్రిడ్ పథకం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బుగ్గన, ఎంపీ పోచా, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొత్త రాజకీయ నేతలకు స్ఫూర్తి

కొత్తగా రాజకీయాల్లోకి వచ్చే నాయకులకు మంత్రి బుగ్గన స్ఫూర్తిగా నిలిచారని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. ప్రజల కష్టాలు, సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించారన్నారు. డోన్ నియోజకవర్గానికి ప్రస్తుతం తాగునీరు 15 ఎంఎల్‌డీ సామర్థ్యం ఉన్న నీటి శుద్ధి కేంద్రం సరిపోతుందని, భవిష్యత్తు జనాభాను దృష్టిలో ఉంచుకొని 42 ఎంఎల్‌డీతో కేంద్రం ఏర్పాటు చేయడం బుగ్గన ముందు చూపునకు నిదర్శనమన్నారు. మంత్రి బుగ్గనతో అభివృద్ధి ప్రారంభోత్సవాల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేఘా సంస్థ ప్రెసిడెంట్ గోవర్ధన్ రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు, గిడ్డంగుల శాఖ డైరెక్టర్ బాబుల్ రెడ్డి, ఉర్దూ అకాడమీ డైరక్టర్ ముర్తుజావలి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీ, మద్దిలేటి స్వామి చైర్మన్ రామచంద్రుడు, ఆర్‌డబ్ల్యూస్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ మనోహర్, డీఈ సోమశేఖర్, సిమెంట్ నగర్, బుగ్గానిపల్లె తండా సర్పంచ్‌లు ఏస్తేరమ్మ, ఆదిలక్ష్మి బాయి, రాజు, వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు గూని నాగరాజు, నాగ వెంకటేశ్వర్లు, రాముడు, యాకోబ్, వెంకటేష్ నాయక్, దస్తగిరి, పిట్టల జాకీర్ పాల్గొన్నారు.



ఆధునికీకరించిన పోలీస్ స్టేషన్ ప్రారంభం

పట్టణంలోని ఆధునీకరించిన పోలీస్ స్టేషన్, నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంపెక్స్, ఇన్స్‌పెక్టర్ కార్యాలయం, విశ్రాంతి గదిని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్ర బోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, కర్నూలు రేంజ్ డీఐజీ ఎస్. సెంథిల్ కుమార్, నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ,అడిషనల్ ఎస్పీ వెంకట రాముడు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డోన్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ ప్రియతం రెడ్డి, ఎస్ఐ శివ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లసర్గం గుహలు అద్భుతం

ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన బిల్ల సర్గం గుహలు అద్భుతంగా ఉన్నాయని ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. సోమవారం కనుమకింది కొట్టాల గ్రామ సమీపంలోని బిల్ల సర్గం గుహలను ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలసి మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సుమారు 80 సంవత్సరాల క్రితం ఈ గుహలు వెలుగులోకి వచ్చినా గత ప్రభుత్వాలు అభివృద్ధి చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 2.50 కోట్లతో పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దిందన్నారు. గుహల అందాలను యాత్రికులు వీక్షించేలా అందుబాటులోకి తెచ్చిందన్నారు. అనంతరం గుహల సమీపంలోని ఏర్పాటు చేసిన పర్యాటక శాఖ రెస్టారెంట్‌ను మంత్రి ప్రారంభించారు. గుహల ఫొటోలతో పెద్ద హోర్డింగ్ ఏర్పాటు చేయాలని పర్యాటక శాఖ జిల్లా అధికారులను మంత్రి ఆదేశించారు.



గుహల లోపలి భాగాలను పరిశీలిస్తున్న మంత్రి, ఎంపీ, జెడ్పీ చైర్మన్

సోలార్ పవర్ ప్రాజెక్ట్ భూముల పరిశీలన



పిక్కర్ల పల్లి తండా సమీపంలో భూముల వివరాలు పరిశీలిస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

అవుకు: అవుకు మండలంలో సోలార్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు భూములను నంద్యాల జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి సోమవారం పరిశీలించారు. పిక్కర్లపల్లి తండా, జూనూతల గ్రామ పొలాల్లో గ్రీన్ కో సంస్థ వారు 2,300 మెగా వాట్లతో నిర్మించబోతున్న సోలార్ పవర్ ప్రాజెక్ట్‌కు సంబంధించి భూముల వివరాలను అవుకు తహసీల్దార్ పోతుల ప్రసాద్ బాబును జేసీ అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో ప్రాజెక్ట్‌కు వినియోగించే భూముల్లో పట్టా భూములు, ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు ఎంత ఉన్నాయి? ఆ భూముల్లో సాగులో రైతులు ఉన్నారా? అనే వాటిపై పరిశీలించాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్ట్‌కు సంబంధించి 4 వేల ఎకరాలు అవసరమవుతాయని దీనికి సంబంధించి పూర్తి నివేదికలు సిద్ధం చేసి జిల్లా కార్యాలయానికి తీసుకురావాలని జేసీ అధికారులను ఆదేశించారు. జేసీ వెంట మండల సర్వేయర్ హరి, ఆర్ఐ వెంగల్ రెడ్డి ఉన్నారు.

సంక్షేమ బావుటా

ఆరోగ్యశ్రీతో పునర్జన్మ

కూలి పని చేసుకుని **జీ**వనం సాగిస్తున్న మా కుటుంబంపై ఉన్నట్టుండి మోయలేని భారం పడింది. నాకు గుండె పోటు రావడంతో వైద్యుల సూచన మేరకు 2023 జనవరి నెలలో నంద్యాలలోని ఓ వైద్యశాలకు తీసుకెళ్లారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉండటంతో ఉచితంగానే స్టంట్ ఆపరేషన్ చేశారు. ఆపరేషన్‌కు సంబంధించి ప్రభుత్వం రూ. 1.20 లక్షలు మంజూరు చేసింది. గత ప్రభుత్వంలో వైద్య సేవలు పొందాలంటే కర్నూలు, హైదరాబాద్ పట్టణ ప్రాంతాలకు కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం స్థానిక వైద్యశాలలోనే వైద్య సేవలు అందుతుండడం మాలాంటి పేదవారికి చాలా ఆనందంగా వుంది. ప్రస్తుతం నా ఆరోగ్యం నిలకడగా వుంది. చేయూత పథకం ద్వారా రూ. 18,750, రైతు భరోసా ద్వారా రూ. 13,500తో పాటు నా భర్తకు వృద్ధాప్య ఫించన్ ప్రతి నెల రూ. 3 వేలు అందుతోంది. సీఎం జగనన్నకు మా కుటుంబం రుణపడి ఉంటుంది.



– బీసన్నగారి దస్తగిరమ్మ, ఉయ్యాలవాడ

సర్కారు సాయంతో గట్టెక్కాం



నా భర్త రమేష్ పదేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించారు. కుమారుడు ఈశ్వర్‌తో పాటు నలుగురు కూతుళ్లుకు గాను ముగ్గురికి వివాహం చేశాను. శిరివెళ్లలోని బ్యాంకులో స్వీపర్‌గా పనిచేస్తుస్తూ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నా. ఇటీవలే ప్రభుత్వం రూ.2 లక్షల విలువ చేసే స్థలం ఇవ్వడంతో పాటు ఇళ్లు కూడా మంజూరు చేసింది. అమ్మ ఒడి రూ.13 వేలు, వసతి దీవెన రూ. 20 వేలు, విద్యాదీవెన రూ.13 వేలు, వైఎస్సార్ చేయూత రూ.75 వేలు, గత ఐదేళ్లుగా రూ.1.50 లక్షలు వైఎస్సార్ పింఛన్‌కానుక కింద అందాయి. గత ప్రభుత్వంలో మా కుటుంబానికి ఎలాంటి ప్రయోజనం జరగలేదు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వంలో మా కుటుంబానికి ఐదు పథకాలు వర్తించాయి. అన్ని నగదు రూపంలో రావడంతో మాకుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకున్నాం. – లలితమ్మ, శిరివెళ్ల

పదిలో ఫలితాలు మెరుగుపడేలా..

- ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కార్యాచరణ
- సీ, డీ గ్రేడ్‌ల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు
- ఉపాధ్యాయులకు ప్రోత్సాహకాలు
- పూర్వ విద్యార్థుల భాగస్వామ్యానికి చోటు



ప్రత్యేక తరగతుల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతిలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు విద్యా శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పక్కాగా అమలు చేస్తోంది. 2023–24 విద్యా సంవత్సరానికి గాను నంద్యాల జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో మొత్తం 30,295 మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 21,750 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. కాగా గతేడాది కంటే ఇంకా మెరుగైన ఉత్తీర్ణత శాతం సాధించేలా విద్యాశాఖ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. చదువులో వెనుకబడి సీ, డీ గ్రేడు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని విద్యాశాఖాధికారులు గుర్తించారు. ఈ మేరకు సీ, డీ గ్రేడుల విద్యార్థులను మరింత సానపెట్టడానికి ఉపాధ్యాయులకు తగిన సూచనలిచ్చారు. అన్ని సబ్జెక్టుల్లో అన్ని పాఠాలు చదవడం వారికి సాధ్యం కాదనే ఉద్దేశంతో పరీక్షల్లో కచ్చితంగా వస్తాయనే ప్రశ్నలను వారికి కేటాయించి వాటి సమాధానాలను ఒకటికి రెండుసార్లు వారు చదివేలా చర్యలు తీసుకుంటున్నారు. ఒక రోజు ఒక సబ్జెక్టులో ముఖ్యమైన ప్రశ్నలను వారికి తెలిపి మునటి రోజు వారు దానికి సమాధానం పేపర్‌పై రాయడంతో పాటు ఉపాధ్యాయులకు అప్పజెప్పేలా తర్ఫీదునిస్తున్నారు. ఇలా రోజు విడిచి రోజు ఒక సబ్జెక్టుపై వారికి పట్టు వచ్చేలా చేస్తున్నారు.



విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న దృశ్యం

అదనపు తరగతులు...

పదో తరగతి విద్యార్థులకు నూరు రోజుల ప్రత్యేక కార్యాచరణ రూపొందించి వారిని పరీక్షలకు సమాయత్తం చేయడంలో భాగంగా ప్రతిరోజూ పాఠశాల సమయంలోనే కాక ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాల తెరవక ముందు ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకూ, అలాగే సాయంత్రం పాఠశాల విడిచిన తరువాత 4 నుంచి 5.30 గంటల వరకూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పరీక్షలకు నెల ముందు నుంచి రాత్రి 8 గంటల వరకు ఆదనపు తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు.

జిల్లాలో పదో తరగతి చదివే విద్యార్థుల వివరాలు

పాఠశాలలు	బాలురు	బాలికలు	మొత్తం
ప్రభుత్వ	10,840	10,910	21,750
ప్రైవేటు	5,269	3,276	8,545
మొత్తం	16,109	14,186	30,295

ఉపాధ్యాయులకు అనుకూలంగా...

విద్యార్థుల ఉత్తమంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు విద్యాశాఖ తగిన ప్రోత్సాహకాలు అందించనుంది. బోధించే సబ్జెక్టుల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించే ఉపాధ్యాయులకు కోరుకునే ప్రాంతాలకు బదిలీ చేయడంలో ప్రాధాన్యత కల్పించడంతో పాటు ఉపాధ్యాయుల అవార్డులకు సిఫార్సు చేసే అవకాశాలు ఉన్నాయి.

ర్యాంకులూ సాధించేలా..

ఏ, బీ గ్రేడ్ విద్యార్థులపై కూడా ఉపాధ్యాయులు దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. పది పరీక్షల అనంత రం జరిగే ఐఐఐటీ, పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ వంటి పోటీ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించేలా వారిని తీర్చిదిద్దాలని, జిల్లా నుంచి ఎక్కువ మంది విద్యార్థులు ట్రి పుల్ ఐటీలకు, ఇతర పోటీ పరీక్షల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించేలా వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

దాతలు, పూర్వ విద్యార్థుల సహకారం..

మెరుగైన ఉత్తీర్ణత ఫలితాలు సాధించే దిశగా వేస్తున్న అడుగుల్లో పాఠశాల పూర్వ విద్యార్థులను, విదేశాల్లో స్థిరపడిన గ్రామస్తులను, గ్రామ పెద్దలను భాగస్వాములను చేసేందుకు విద్యాశాఖాధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. అదనపు తరగతుల్లో విద్యార్థులకు దాతల సాయంతో స్నాక్స్ అందించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో దాతలు ముందుకు రాగా మిగిలిన ప్రాంతాల్లో కూడా వాతల సహకారం తీసుకోవడానికి కృషి చేస్తున్నారు.

మెటీరియల్ పంపిణీ చేస్తాం

ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే సంబంధిత పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు మార్గదర్శకాలు జారీ చేశాం. జిల్లా పరీక్షల నిర్వహణ సంస్థ ద్వారా ముఖ్యమైన ప్రశ్నలు, జవాబులతో కూడిన మెటీరియల్‌ను జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సహకారంతో ఈ నెల 30వ తేదీ నుంచి విద్యార్థులకు అందిస్తాం. గిరిజన ప్రాంతాల్లో పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. విదేశాల నుంచి తమ ప్రాంతాలకు వచ్చిన వారెవరైనా ఉంటే తమ ప్రాంతాల్లోని విద్యార్థులతో మమేకమయ్యేలా ప్రయత్నాలు చేసి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపడానికి చర్యలు తీసుకుంటున్నాం. – సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం, 5వ తరగతి ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశానికి ఆసక్తి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ ఈఐఎస్ జిల్లా సమన్వయ అధికారిణి దీప్తి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులను ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ప్రతి కళాశాలలోని ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 40 సీట్లు, 5వ తరగతిలో 80 సీట్లు ఉన్నాయన్నారు. కోవెలకుంట్ల (బాలికలు), ఆళ్లగడ్డ రెగ్యులర్ (బాలికలు), ఆళ్లగడ్డ ఆర్‌పీఆర్‌పీ (బాలికలు), లక్ష్మాపురం (బాలికలు), డోన్ (బాలికలు), జూపాడుబంగ్లా (బాలురు), డోన్ (బాలురు) పాఠశాలకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఎస్సీలకు 75 శాతం, కన్వర్ట్ క్రిష్టియన్లకు 12 శాతం, ఎస్టీలకు 6 శాతం, బీసీలకు 5 శాతం, ఇతరులకు 2 శాతం రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయించబడుతాయన్నారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తులను ఫిబ్రవరి 23లోగా వెబ్‌సైట్ https://apbragcet.apcfss.in ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష మార్చి 10వ తేదీన ఉంటుందన్నారు.

ఉమ్రా యాత్రలో విషాదం

- చాగలమర్రి వాసి గుండెపోటుతో మృతి


మృతి చెందిన చాంద్ బాషా (ఫైల్)

చాగలమర్రి: స్థానిక ముత్యాలపాడు బస్టాండు వీధికి చెందిన ఓ వ్యక్తి మక్కాలో గుండెపోటుతో మృతి చెందారు. డ్రైవర్ జంగాల్‌పల్లె చాంద్‌బాషా (58) తన భార్య మహబూబ్‌చాన్‌తో కలిసి ఉమ్రా యాత్రకు సిద్ధమయ్యారు. ఈ మేరకు వైఎస్సార్ జిల్లాకు చెందిన 25 మంది ఉమ్రా యాత్రికులతో కలిసి చాంద్‌బాషా దంపతులు ఆదివారం హైదరాబాదుకు చేరుకున్నారు. అక్కడి నుండి విమానంలో సోమవారం ఉదయం సౌదీ అరేబియాలోని మక్కా నగరానికి చేరుకున్నారు. అక్కడ మక్కా మసీదును దర్శించుకునేందుకు సిద్ధమవుతుండగా రూమ్‌లోనే చాంద్‌బాష(58) గుండెపోటుతో మృతి చెందాడు. భర్త మృతితో భార్య మాహబూబ్ చాన్ వెంటనే కుటుంబీకులకు సమాచారం అందించడంతో కాలనీలో కుటుంబీకులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. అతని పెద్ద కుమారుడు హనీఫ్‌తోపాటు మరొకరు హుటాహుటిన సౌదీకి బయలుదేరారు. చాంద్‌బాష మృతదేహానికి మక్కాలోనే అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

సమర్థంగా విధులు నిర్వహించాలి


రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆర్మ్‌డ్ రిజర్వు సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా ఆర్ముడు రిజర్వ్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆర్ముడు రిజర్వ్ సిబ్బంది విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. అందుకు అనుగుణంగా శారీరక, మానసిక ధృఢత్వం కూడా అవసరమన్నారు. శిక్షణ సమయంలో తీసుకున్న తర్ఫీదు అంశాలు గుర్తు చేసుకుంటూ విధులు నిర్వహించాలన్నారు. ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ కేటాంచిన విధులను సకాలంలో నిర్వర్తించాలన్నారు. అనంతరం ఆయన ఆర్ఐ స్టోర్స్, ఆయుధాగారం, సెక్యూరిటీ విభాగం, ట్రాన్స్‌పోర్ట్ విభాగం, హోం గార్డ్ కార్యాలయాలు పరిశీలించి రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఎస్పీ వెంట ఏఆర్ అడిషినల్ ఎస్పీ చంద్రబాబు, డీఎస్పీ రంగముని, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, శ్రీనివాసులు, మంజునాథ్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కందికి 'మార్కెట్ ధర'.. జొన్నకు 'మద్దతు'

అన్నదాతకు అండగా ప్రభుత్వం
- డీసీఎంఎస్ ద్వారా కందుల కొనుగోలు
- గోనెసంచులు, లేబర్, రవాణా చార్జీల చెల్లింపు
- ఇప్పటికే 9వేల క్వింటాళ్లు కొనుగోలు చేసిన డీసీఎంఎస్
- రబీ జొన్నలు మద్దతు ధరతో కొనుగోలుకు రంగం సిద్ధం


రైతుల నుంచి కందులను కొనుగోలు చేస్తున్న డీసీఎంఎస్ ప్రతినిధి

కర్నూలు(అగ్రికల్చర్): 2023–24లో పండించిన కందులు, జొన్నల కొనుగోలుకు ప్రభుత్వం రైతుల వద్దకే వివిధ సంస్థలను పంపుతోంది. బహిరంగ మార్కెట్‌లో కందుల ధర ఎక్కువగా ఉండటంతో మార్కెట్ ధరకే ప్రభుత్వం రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ద్వారా కొనుగోలు చేస్తోంది. అదేవిధంగా మార్కెట్‌లో జొన్నల ధర తక్కువగా ఉండటంతో కనీస మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేయడం విశేషం. రైతుల నుంచి కొనుగోలు చేసిన కందులు, జొన్నలను తిరిగి ప్రభుత్వం ప్రజాపంపిణీ ద్వారా వినియోగదారులకు సరఫరా చేస్తుంది. 2023–24లో వర్షాభావ పరిస్థితులు నెలకొనడం వల్ల సాగు విస్తీర్ణం తగ్గింది. ఇదే సమయంలో దిగుబడి కూడా తగ్గింది. అయితే కందులకు మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో ధర ఆశాజనకంగా ఉంది. నాణ్యతను బట్టి క్వింటా రూ.9600 నుంచి రూ.10వేలకు పైగా పలుకుతోంది. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో ప్రజాపంపిణీ ద్వారా కందిపప్పు సరఫరా చేయడానికి ప్రభుత్వం కందుల కొనుగోలుకు పౌరసరఫరాల సంస్థను రంగంలోకి దింపింది. ఈ సంస్థ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ద్వారా కందులు, జొన్నలను కొనుగోలు చేస్తోంది.

ఏడు రోజుల్లోనే రైతుల ఖాతాకు నగదు జమ

కందులను నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు అధికారులు కొద్ది రోజులుగా రైతుల వద్దకే వెళ్తున్నారు. మద్దతు ధరతో కందులు కొనుగోలు చేసినప్పుడు రైతుల బ్యాంకు ఖాతాలకు 21 రోజుల పని దినాల్లో నగదు జమ చేయడం పరిపాటి. ఇప్పుడు 7 పని దినాల్లోనే రైతుల ఖాతాకు నగదు జమ చేసేందుకు పౌరసరఫరాల సంస్థ రంగం సిద్ధం చేసుకుంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా సివిల్ సప్లయ్ కార్పొరేషన్, డీసీఎంఎస్, మార్క్‌ఫెడ్ అధికారులు కందుల కోసం రైతుల దగ్గరకు వెళ్తున్నారు. ఏ రోజు ధరను అదేరోజు సీఎం యాప్‌లో ఉంచుతారు. సీఎం యాప్‌లో వచ్చే ధర ప్రకారం కందులు కొనుగోలు చేస్తారు. పౌరసరఫరాల సంస్థ మార్కెట్ ధర ప్రకారం రూ.9,445తో కందులు కొనుగోలు చేస్తారు. ఇందులో లేబర్, గన్నీ బ్యాగ్, ట్రాన్స్‌పోర్టు చార్జీలు కూడా ఉంటాయి.

డీసీఎంఎస్ ద్వారా 9వేల క్వింటాళ్ల కందుల కొనుగోలు

కొద్ది రోజుల క్రితమే జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ 9వేల క్వింటాళ్ల కందులు కొనుగోలు చేసింది. మొదట్లో బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర మేరకు నాఫెడ్ ధర ఉండటంతో రైతులు డీసీఎంఎస్‌కు కందులు విక్రయించారు. తాజాగా కేవలం పౌరసరఫరాల సంస్థకే డీసీఎంఎస్ కందులు కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఆ మేరకు అధికారులు వివిధ మండలాల్లో రైతులను కలిసి మార్కెట్ ధరకే కందులను కొనుగోలు చేస్తామని పేర్కొంటున్నారు.

మద్దతు ధరతో జొన్నల కొనుగోలు

జొన్నలను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థను రంగంలోకి దింపింది. జొన్నలకు కనీస మద్దతు ధర రూ.3180. మద్దతు ధర మహేంద్ర రకాలకు చెందిన తినే జొన్నలకే వర్తిస్తుంది. మార్కెట్‌లో ప్రస్తుతం జొన్నల ధర రూ.2600 మాత్రమే. ఈ నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంది. జొన్న సాగు చేసినట్లు ఈ–క్రాప్‌లో నమోదై.. ఈ–కేవైసీ చేయించుకున్న రైతుల నుంచి జొన్నలు మద్దతు ధరతో కొనుగోలు చేస్తారు. రైతులు ముందుగా ఆర్‌బీకేల్లో సంప్రదించి సీఎం యాప్‌లో పేర్లు నమోదు చేయించుకోవాల్సి ఉంది.

చెరకు పంట దగ్ధం


దగ్ధమవుతున్న చెరకు పంట

జూపాడుబంగ్లా: పొలంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగల వల్ల షార్ట్‌సర్క్యూట్‌తో చెలరేగిన మంటలకు చెరకు పంట దగ్ధమైంది. ఈ ప్రమాదం తంగడంచ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నాగిరెడ్డి, సుభద్రమ్మ, శ్రీనివాసరెడ్డి, రమణారెడ్డి, రామకృష్ణారెడ్డి తలా రెండు ఎకరాల చొప్పున పది ఎకరాల్లో చెరకు పంట సాగుచేశారు. ఆదివారం రాత్రి పంటపొలంపై కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు తగలడంతో పంటకు మంటలు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న రైతులు మంటలను ఆర్పేందుకు యత్నించారు. సాధ్యం కాకపోవటంతో ఆత్మకూరు ఫైర్‌స్టేషన్ అధికారులకు సమాచారం ఇవ్వటంతో వారు సంఘటనా ప్రాంతానికి చేరుకొని చెరకు పంటకు వ్యాపించిన మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు 70శాతం మేర పంట దగ్ధం కావడంతో రైతులకు రూ.15 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేటి నుంచి కుష్టువ్యాధి అవగాహన పక్షోత్సవాలు


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఆర్‌వో పుల్లయ్య, డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ తదితరులు

నంద్యాల టౌన్: జిల్లాలో మంగళవారం నుంచి 15 రోజుల పాటు కుష్టువ్యాధి అవగాహన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ పరిధిలోని సెంటినరీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఆర్వో పుల్లయ్య మాట్లాడుతూ మహాత్మా గాంధీ కుష్టు వ్యాధిగ్రస్తులకు చేసిన సేవలకు గుర్తుగా ఆయన వర్ధంతి జనవరి 30వ తేదీని ప్రభుత్వం యాంటీ లెప్రసీ డేగా నిర్వహిస్తుందన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకట రమణ మాట్లాడుతూ ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్టు వ్యాధిపై క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టుతామన్నారు. కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎం. శారదా బాయి, డీసీహెచ్‌ఎస్ జఫ్రుల్లా, సూపరింటెండెంట్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కుంగిన బండ్‌ను పరిశీలించిన సీఈ

పాణ్యం: గోరుకల్లు జలాశయం ఓటీ రెగ్యులేటర్ వద్ద కుంగిన బండ్‌ను సోమవారం జలవనరుల శాఖ సీఈ కబీర్‌బాషా పరిశీలించారు. బండ్ కుంగడానికి గల కారణాలను ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. ఇంకోసారి బండ్ కుంగకుండా తీసుకోవల్సిన చర్యలపై చర్చించారు. ప్రస్తుతం పనులు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. ఇదిలా ఉండగా పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఈ విషయంపై ఫోన్‌లో జలవనరుల శాఖ మంత్రి, ఈఎన్‌సీతో మాట్లాడారు. మరమ్మతులు త్వరగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఈ వెంట ఈఈ సుభకుమార్, డీఈఈ అశ్వర్థనారాయణ, ఏఈఈలు ఉన్నారు.

సైబర్ నేరగాళ్లు రూ.1.60 లక్షలు కాజేశారు!

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు


బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: ట్రేడ్స్ ఎక్స్ కంపెనీ పేరుతో సైబర్ నేరగాళ్లు తన వాట్సాప్‌కు లింక్ పంపి ఫోన్‌లో ఉన్న డేటా సేకరించి బ్యాంక్ ఖాతా నుంచి రూ.1.60 లక్షలు తీసుకుని మోసగించారని, చర్యలు తీసుకోవాలని ఎస్పీ కృష్ణకాంత్‌కు ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన రిజ్వాన్ బాషా ఫిర్యాదు చేశారు. కర్నూలులోని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కనున్న క్యాంపు కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్ సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి వినతులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందన కార్యక్రమానికి మొత్తం 66 ఫిర్యాదులు వచ్చాయి. వాటన్నింటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. డీఎస్పీ శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు తదితరులు స్పందనలో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు.

స్పందనకు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- కన్సల్టెన్సీ పేరుతో కొంతమంది వ్యక్తులు ఉద్యోగాల పేరుతో డబ్బులు తీసుకుని మోసం చేశారని , విచారణ జరిపి డబ్బులు వాపసు ఇప్పించాల్సిందిగా కర్నూలుకు చెందిన విష్ణు కోరారు.
- ఆస్తి కోసం కుమారుడు తనను చంపుతానని బెదిరిస్తున్నాడని, రక్షణ కల్పించాల్సిందిగా హొళగుంద మండలం హెబ్బటం గ్రామానికి చెందిన ఈశ్వరప్ప వినతి పత్రం అందించారు.
- భూమిని దౌర్జన్యంగా ఆక్రమించి సర్వేయర్‌ను కొలతలు వేయనివ్వకుండా శ్రీనివాసులు, లక్ష్మీ నారాయణ అనే వ్యక్తులు అడ్డుపడుతున్నారని ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామానికి చెందిన వెంకటస్వామి ఫిర్యాదు చేశారు.
- పొలం కౌలుకు తీసుకున్న వ్యక్తి నకిలీ అగ్రిమెంట్లు సృష్టించి మోసం చేశాడని, తన పొలానికి కోర్టు ఇంజెక్షన్ ఆర్డర్ ఉన్నప్పటికీ ఆరు ఎకరాల జొన్న పంటను దున్ని నాశనం చేసిన నగరూరు గ్రామానికి చెందిన రంగన్న, ప్రభాకర్‌లపై చర్యలు తీసుకోవాలని ఆస్పరి మండలం నగరూరు గ్రామానికి చెందిన హుసేనప్ప ఫిర్యాదు చేశారు.
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి వైఎస్సార్ జిల్లాకు చెందిన మంజునాథ్ రెడ్డి డబ్బులు తీసుకుని నకిలీ నియామక పత్రాలు పంపి మోసం చేశాడని నాగలాపురం గ్రామానికి చెందిన ఉపేంద్ర, కర్నూలుకు చెందిన విష్ణుచరణ్‌లు ఫిర్యాదు చేశారు.

ఇన్‌చార్జ్ డిప్యూటీ కమిషనర్‌గా విశ్వేశ్వర రెడ్డి

కర్నూలు (టౌన్): నగర పాలక ఇన్‌చార్జ్ డిప్యూటీ కమిషనర్‌గా విశ్వేశ్వర రెడ్డిని కమిషనర్ భార్గవ్‌తేజ నియమించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రెండు రోజుల క్రితం ఇక్కడ పనిచేస్తున్న డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీ శివారెడ్డి వినుకొండ మున్సిపాల్టీకి కమిషనర్‌గా బదిలీపై వెళ్లడంతో నగరపాలక ఆరోగ్యశాఖాధికారిగా పనిచేస్తున్న ఆయనను నియమించారు.


జిల్లా జైలును సందర్శన

కర్నూలు (లీగల్) : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు సోమవారం పంచలింగాల గ్రామంలోని జిల్లా జైలును సందర్శించారు. అక్కడ ఉన్న ఖైదీల వివరాలను సంబంధిత జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారికి అందించే భోజన సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. ఖైదీలకు ఉచిత న్యాయ సేవల గురించి వివరించారు. ఉన్నత న్యాయ సేవ అధికార సంస్థ ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ వ్యవస్థ ద్వారా అందిస్తున్న మెరుగైన ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు బంగారు, వెండి పుష్పాల సమర్పణ


స్వామివార్లకు సమర్పించిన బంగారు వెండి పుష్పాలు,


బంగారు, వెండి పుష్పాలను సమర్పించిన దాతలు మురళీ తదితరులు


కమలాకారంలో దాతలు డిజైన్‌తో చేయించిన బంగారు పుష్పాలు

శ్రీశైలం: శ్రీశైల మహాక్షేత్రంలో కొలువుదీరిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ప్రత్యేక పూజలలో వినియోగించుకోవడానికి వీలుగా హైదరాబాద్‌కు చెందిన మురళి తన కుటుంబ సభ్యులతో కలిసి బంగారు, వెండి పుష్పాలను సోమవారం సమర్పించారు. ఆలయ ప్రాంగణమంలోని అమ్మవారి ఆశీర్వచన మండపంలో వసతివిభాగం సహాయ కార్యనిర్వహణాధికారి ఐఎన్‌వీ మోహన్, పర్యవేక్షకులు స్వాములుకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ 82 గ్రాములతో 8 తామరపువ్వు డిజైన్‌తో ఉన్న బంగారు పుష్పాలు, 40 గ్రాములతో 110 వెండి చిన్న పుష్పాలను రూ. 5.45లక్షలతో తయారు చేయించినట్లు తెలిపారు. అనంతరం దాతలకు దేవస్థానం అధికారులు స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలు, లడ్డుప్రసాదాలు అందజేసి సత్కరించారు.

రేషన్.. లేదు పరేషాన్!

నంద్యాల జిల్లా	కర్నూలు జిల్లా..
రేషన్ కార్డులు : 5.49 లక్షలు	రేషన్ కార్డులు: 6.71 లక్షలు
ఎండీయూ వాహనాలు: 351	ఎండీయూ వాహనాలు: 409


నాడు : రేషన్ కోసం క్యూ నిల్చున్న జనాలు

- ఇంటి వద్దకే రేషన్ పంపిణీ
- తొలిగిన ఇబ్బందులు



నేడు: ఇంటి వద్దే నిత్యావసర సరుకుల పంపిణీ

మద్దికెర : రేషన్ కోసం గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన పని లేదు. కిలోమీటర్ల దూరం నడవాల్సిన అవసరం అంతకంటే లేదు. ఇంటి వద్దకే రేషన్ పంపిణీ వస్తోంది. గతంలో బియ్యం తీసుకోవాలంటే రోజుల తరబడి వేచి చూడాల్సి వచ్చేది. సరుకుల కోసం వెళ్తే డీలర్ అందుబాటులో ఉండేవారు కాదు. రేషన్ కోసం రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. తూకంలో మోసాలు సరేసరి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటికే రేషన్ సరుకులు అందించడానికి ఎండీయూ ఆపరేటర్లను నియమించారు. వారికి వాహనాలు అందించారు. ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో ప్రజల ఇబ్బందులు తొలగిపోయాయి. తూకాల్లో మోసానికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా రేషన్ పంపిణీ చేస్తున్నారు. జీపీఎస్, రైస్ కార్డు మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టి ప్రజలకు సరుకులు అందిస్తున్నారు. జీపీఎస్ మ్యాపింగ్‌తో లబ్ధిదారులు ఏరేషన్ షాపు పరిధిలో ఉన్నా, నివసించే ప్రాంతంలోని చౌకదుకాణం నుంచే పోర్టబులిటీ ద్వారా రేషన్ తీసుకోవచ్చు. వేరే ప్రాంతానికి వెళితే అప్రాంత వలంటీర్ కు సమాచారం ఇచ్చి జీపీఎస్ మ్యాపింగ్ చేయించుకుంటే చాలు. గడప దాటకుండానే నెలారంభంలో పదిరోజులు పాటు సరుకులు అందించనున్నారు. ఏరోజుకు ఏవీధిలో ఎవరి ఇళ్ల వద్దకు ఎన్ని గంటలకు రేషన్ డెలివరీ వాహనం వస్తుందో ముందుస్తు సమాచారం ఇస్తున్నారు. కుటుంబంలో ఒకరు ఉంటే చాలు సరుకులు అందజేస్తారు.

నాణ్యమైన బియ్యాన్ని అందిస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పేదలకు నాణ్యమైన బియ్యాన్ని అదిస్తున్నాం. సకాలంలో లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేస్తాం. సిద్ధం చేసిన వాహనాల్లో సరుకులు చేరవేసేందుకు చర్యలు చేపడతున్నాం.

– నాగభూషణం, తహసీల్దార్, మద్దికెర

ఇంటి వద్దే సరుకులు అందిస్తున్నారు



గతంలో స్టోర్‌కు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సి వచ్చేది. ప్రస్తుతం ఇంటి వద్దకే వ్యానులో వచ్చి సరుకులు ఇస్తున్నారు. మాలాంటి వృద్ధులకు ఇలాంటి సౌకర్యం కల్పించడం చాలా సంతోషంగా ఉంది.

– లక్ష్మీదేవి, మద్దికెర

వాహనం ఏర్పాటు చేయడం సంతోషం



మేము రాంనగర్‌లో ఉంటున్నాం. రేషన్ షాపు కిలోమీటరు దూరంలో ఉంటుంది. ప్రతినెలా రేషన్ కోసం ఇబ్బందులు పడేవాళ్లం. ప్రభుత్వం వాహనం ఏర్పాటు చేసిన తరువాత ఇంటి వద్దనే సరుకులు పంపిణీ చేస్తున్నారు. మాకు చాలా సంతోషంగా ఉంది. –రాజేష్, మద్దికెర

సకాలంలో అందజేస్తున్నాం



అధికారుల ఆదేశాల మేరకు సకాలంలో ప్రజలకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్నాం. అంతేగాక కాలనీలకు ఎప్పుడు వచ్చేది సూచనలు ఇస్తాం. దీంతో వాహనం వచ్చిందని లబ్ధిదారులు వచ్చి సరుకులు తీసుకెళ్తారు.

–షేక్షావలి, ఎండీయూ ఆపరేటర్, మద్దికెర